

బీసీల రాజకీయ వేదిక టీడీపీ

రెడ్ల చేతిలో రాష్ట్రం చిక్కుకుంది

టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు



జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు, ఆర్ జితేంద్ర గౌడు

గుంతకల్లు, జనవరి 12: బీసీలకు రాజకీయ వేదికను కల్పించింది తెలుగుదేశం పార్టీయేనని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు అన్నారు. గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువులో శుక్రవారం జయహో బీసీ నియోజకవర్గ సదస్సును నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు కాలవ హాజరై ప్రసంగించారు. బీసీలకు ఏం చేశారని వైసీపీ నాయకులు సాధికార యాత్ర చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో 74 మంది బీసీలను అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పొట్టన పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ మొదలుకుని వైసీపీ ప్రజాప్రతినిధులందరూ ప్రజలను దోచుకున్నారని అన్నారు. రాష్ట్రం రెడ్ల చేతిలో చిక్కుకుందని విమర్శించారు. గుంతకల్లు ఎమ్మెల్యే ఈ నియోజకవర్గంలో చేసిన మంచిపనులు ఏవైనా ఉన్నాయా అని ప్రశ్నించారు. జితేంద్రగౌడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో మూడు చెరువులకు అధికారికంగా 0.6 టీఎంసీల నీటిని సాధించారని అన్నారు. ఎమ్మెల్యేలు చెత్తలా తయారైనందున జగన్ వారిని పక్కనపెడుతున్నారని అన్నారు. జగన్ ఇంతటి దుర్మార్గుడని తెలియక గత ఎన్నికల్లో బీసీలు మోసపోయి ఓటువేశారని జితేంద్రగౌడు అన్నారు. అధికారం వచ్చాక టార్గెట్ చేసి మరీ బీసీలపైనే దాడులు చేశారని అన్నారు. పార్టీలో చేరలేదని ఓ బీసీ మహిళను వివస్త్రను చేసి హత్యచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి బీసీలు టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు ఆర్.పవన్ కుమార్ గౌడు, బీఎస్ కృష్ణారెడ్డి, ప్రతాప్ నాయుడు, ఆవుల కృష్ణయ్య, కె.నారాయణ స్వామి, సి.రమేశ్, బి.నాగేంద్ర, తలారి మస్తానప్ప, జి.వెంకటేశ్, పాల మల్లికార్జున, కురుబ చంద్రశేఖర్, సిమెంటు పోలన్న, జిలాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు, పేకాట ఆడితే కఠిన చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం, జనవరి 12: సంక్రాంతి పండుగ రోజుల్లో సంప్రదాయ క్రీడల పేరుతో కోడి పందేలు, పేకాట ఆడినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఓ ప్రకటనలో హెచ్చరించారు. కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందేల జూదరులు, కోడి కత్తుల తయారీదారులు, పేకాట నిర్వాహకులపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే డయల్ 100, 112 లేదా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో టోల్‌ఫ్రీ నంబర్ 14500కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

క్రమశిక్షణను ఉల్లంఘించిన కాపు

రాయదుర్గం, జనవరి 12: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి వైసీపీ క్రమశిక్షణను ఉల్లంఘించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. రాయదుర్గంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర పార్టీల నుంచి పోటీ చేస్తానని, అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉంటానని కాపు రామచంద్రారెడ్డి చెప్పడం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని అన్నారు. ఆయన అలాంటి నిర్ణయాలు తీసుకునే పరిస్థితి ఉంటే పార్టీకి, పదవికి రాజీనామా చేసి స్వేచ్ఛగా వెళ్లిపోవచ్చని అన్నారు. కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్ ఎంపీ పదవికి, పార్టీకి రాజీనామా చేశారని, ఆయనను కాపు అనుసరించి.. వ్యాఖ్యలు చేసుకోవచ్చని అన్నారు. పార్టీ ఆయనకు మూడుసార్లు అవకాశం ఇచ్చిందని, జగన్ బొమ్మతో గెలిచి ఇప్పుడు

యాడికి మండలం వేములపాడు గ్రామానికి చెందిన రాకేష్, జ్ఞానేశ్వరి అనే చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల ఇచ్చిన కోడి గుడ్లను తిని అస్వస్థతతో ఆస్పత్రిపాలయ్యారు. విడతలవారీగా ఇవ్వాల్సిన గుడ్లు ఒకేసారి ఇవ్వడం, కాలం చెల్లిన గుడ్లను పంపిణీ చేయడం దీనికి కారణం. అంగన్‌వాడీ వర్కర్లు సమ్మెలో ఉండటంతో సచివాలయ సిబ్బంది వీటిని పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు గుడ్లు ఇచ్చినప్పుడు ఇలా ఎన్నడూ జరగలేదని చిన్నారుల తల్లిదండ్రులు అన్నారు. ఎవరు చేయాల్సిన పనిని వారే చేయాలి. ఆ పనిపై వారికే అవగాహన ఉంటుంది. అలాకాకుండా.. ప్రయోగాలకు పోతే ఇలాగే వికటిస్తాయి.

యాడికిలో మూతబడిన అంగన్వాడీ సెంటర్-3



అన్నీ నిలిచిపోయాయి..



పౌష్టికాహారం దూరం

అంగన్‌వాడీ కేంద్రాలు మూత

- ఇళ్లకే పరిమితమైన చిన్నారులు
- గర్భిణులు, బాలింతల టీహెచ్ఆర్ పక్కదారి
- 32 రోజులుగా వర్కర్లు, ఆయాల ఆందోళనలు
- కేంద్రాల్లో కనిపించని సచివాలయ సిబ్బంది

అనంతపురం విద్య, జనవరి 12: అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు.. చిన్నారులు, బాలింతలు, గర్భిణులను తమ కుటుంబ సభ్యుల్లాగా చూసుకుంటారు. ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని వారికి అందించి.. ఆరోగ్యాన్ని కాపాడుతారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణలో కొన్నేళ్ల నుంచి వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు. తక్కువ జీతాలకు, అసౌకర్యాల నడుమ పనిచేస్తున్న అంగన్‌వాడీలకు ఇటీవల పనిభారం పెరిగింది. ఈ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని, అధికారంలోకి రాగానే పొరుగు రాష్ట్రం కంటే ఎక్కువ జీతం ఇస్తానని జగన్ హామీ ఇచ్చారు. ఆ మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ.. గత ఏడాది డిసెంబరు 12 నుంచి అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లారు. నెల గడిచినా ప్రభుత్వం దిగిరాలేదు. చర్చలు పదే పదే విఫలమౌతున్నాయి. అంగన్‌వాడీలు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో నెల రోజులకు పైగా అంగన్‌వాడీ కేంద్రాలు మూత పడ్డాయి. వాటిని బలవంతంగా తెరిపించి, నడిపించాలని ప్రభుత్వం చూసినా.. సాధ్యం కాలేదు. అక్కడక్కడ ఈ ప్రయోగాలు వికటించాయి. ఈ క్రమంలో లబ్ధిదారులకు పౌష్టికాహారం నిలిచిపోయింది. మొదట్లో హడావుడి చేసిన సచివాలయ మహిళా పోలీసులు, ఇతర శాఖల అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల ముఖం కూడా చూడటం లేదు. కొన్ని చోట్ల 15 రోజులు, 20 రోజులుగా కేంద్రాలు మూతపడ్డాయి. జిల్లా వ్యాప్తంగా 80 నుంచి 90 శాతం కేంద్రాల్లో ఇదే పరిస్థితి. ఫలితంగా బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందడం లేదు. అధికారులు మాత్రం కాకి లెక్కలు చెప్పి.. సమస్య పెద్దగా లేదని మాయ చేస్తున్నారు.



అనంత : మురువకొమ్మ కాలనీలో మూతబడిన సెంటర్

కొన్ని ప్రాంతాల్లో పక్కదారి

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు ఇచ్చే కోడిగుడ్లు, టేక్ హోం రేషన్ (టీహెచ్ఆర్), వైఎస్సార్ కిట్లు పక్కదారి పడుతున్నాయి. లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేయాలని ఐసీడీఎస్ అధికారులు చెబుతున్నారు. దీంతో అక్కడక్కడ వలంటీర్లు వెళ్లి గర్భిణులు, బాలింతలకు కిట్లు, టీహెచ్ఆర్ ఇస్తున్నారు. ఈ క్రమంలో కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అంగన్‌వాడీల సమ్మెతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలోని 2302 కేంద్రాల పరిధిలో వేలాది మంది లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా చేరడం లేదు. ప్రభుత్వం చొరవచూపి.. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే.. లబ్ధిదారులకు మరింత నష్టం జరుగుతుంది.

ఒంటి కాలిపై నిరసన

అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల సమ్మె 32వ రోజు శుక్రవారం కొనసాగింది. కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రోడ్డుపైకి వచ్చి ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. రోజుల తరబడి ఆందోళనలు కొనసాగిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గార్లదిన్నెలో షోకాజ్ నోటీసులను దహనం చేశారు.

గోరుముద్దలేవీ జగనన్నా..?

అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లగానే ప్రభుత్వం బలవంతంగా కేంద్రాలను తెరవాలని ఆదేశించింది. ఐసీడీఎస్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓల ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు హడావుడిగా తాళాలు పగలకొట్టారు. అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి.. తమ వెంట తెచ్చుకున్న తాళాలు వేశారు. అది తడవు.. తలుపులు తెరుచుకోవడం లేదు. కొన్ని చోట్ల అరగంటపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో కూర్చుని, ఇళ్లకు వెళ్లిపోతున్నారు. వేలాది అంగన్‌వాడీ కేంద్రాల్లో పొయ్యి వెలగడం లేదు. పిల్లలకు భోజనం, గుడ్డు, పాలు అందడం లేదు. మొదట్లో పాఠశాలల్లో తయారు చేసిన అన్నాన్ని తీసుకొచ్చి పిల్లలకు తినిపించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు అది కూడా చేయడం లేదు.



కలెక్టరేట్ వద్ద ఒంటికాలిపై నిలబడి నిరసన

యాడికిలో ఇటీవల కుళ్లిన గుడ్లు తినడంతో...అనారోగ్యంపాలైన చిన్నారులు



జిల్లా వ్యాప్తంగా 11 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. అనంతపురం అర్బన్, గుత్తి, కంబదూరు, కళ్యాణదుర్గం, కణేకల్లు, కూడేరు, రాయదుర్గం, శింగనమల, తాడిపత్రి, ఉరవకొండ, నార్పల ప్రాజెక్టుల పరిధిలో 2,302 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 7 నెలల నుంచి 3 ఏళ్లలోపు చిన్నారులు 82,106 మంది ఉన్నారు. 3-6 ఏళ్ల మధ్య వయసు పిల్లలు మరో 40,607 మంది ఉన్నారు. 16,255 మంది గర్భిణులు, 16,212 మంది బాలింతలు ఉన్నారు. మూడేళ్లలోపు పిల్లలకు ప్రతి నెలా బాలామృతం, 25 కోడి గుడ్లు, 2.50 లీటర్ల పాలు ఇవ్వాలి. మూడు నుంచి ఆరేళ్లలోపు వారికి చక్కని భోజనం పెట్టాలి. రోజుకు వంద మి.లీ. పాలు, ఒక గుడ్డు ఇవ్వాలి. గర్భిణులు, బాలింతలకు రాగిపిండి, బెల్లం, వేరుశనగ చిక్కీలు, ఎండు ఖర్జూరం, అటుకులు కిట్ల రూపంలో (టీహెచ్ఆర్) ఇవ్వాలి. బియ్యం, నూనె, కందిపప్పు, పాలు ఇళ్లకు ఇవ్వాలి. నెలకు 25 కోడిగుడ్లు, 5 లీటర్ల పాలు అందజేయాలి. ఇవన్నీ ప్రస్తుతం లబ్ధిదారులకు చేరడం లేదు. గర్భిణులు, బాలింతల పరిస్థితి అటుంచితే.. పిల్లలను పట్టించుకునేవారే లేకుండాపోయారు. ఐసీడీఎస్ అధికారులు మౌనంగా ఉండిపోతున్నారు.



ఐసీడీఎస్ ఆఫీస్ (ఫైల్)

ఎవరూ పట్టించుకోవడం లేదు..



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు టైంకి కిట్లు ఇచ్చేవారు. కోడిగుడ్లు, పాలు, అటుకులు కేంద్రాలకు రాగానే మాకు సమాచారం ఇచ్చేవారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మెలో ఉండటంతో వేరే అధికారులు ఈ పని చేస్తున్నారు. కానీ వారు ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళతారో తెలియడం లేదు. సచివాలయ ఉద్యోగులు ఈ పని చేయలేరు. ముఖ్యమంత్రి జగన్ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించి, వారు విధుల్లో చేరేలా చూడాలి.

\- భాను, నవోదయ కాలనీ, అనంతపురం

ముగ్గురు చిన్నారులు ఇంట్లోనే..



నా మనవరాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వాళ్లకు అంగన్‌వాడీ కేంద్రంలో పాలు, కోడిగుడ్లు, బాలామృతం ఇచ్చేవారు. నెల రోజులుగా అంగన్‌వాడీ బడి లేదు. ముగ్గురు పిల్లలను ఇంట్లోనే పెట్టుకున్నాం. టీచర్లు, ఆయాలు సమ్మెలో ఉన్నారు. వేరే మేడం వాళ్లు ఎప్పుడొస్తారో, ఎప్పుడు వెళతారో తెలియదు.

\- రసూల్‌బీ, మరువకొమ్మ కొట్టాల, అనంతపురం

ఆలోగా చేసేద్దాం..!

జడ్పీలో రూ.కోటి బిల్లులకు స్కెచ్.. కొత్త సీఈఓ వచ్చేలోగా దోచేయాలని..!



అనంతపురం విద్య, జనవరి 12: జిల్లా పరిషత్‌లో కోట్ల రూపాయల బిల్లుల దోపిడీకి స్కెచ్ వేసినట్లు సమాచారం. కొందరు అధికార పార్టీ కాంట్రాక్టర్ల సంస్థలకు బిల్లులు చేసి.. వారికి లాభం చేకూర్చడానికి, పనిలో పనిగా కమీషన్లు పిండుకోడానికి అడ్డగోలు వ్యవహారాలకు తెరతీసినట్లు తెలిసింది. జడ్పీలో కొందరు ఉన్నతాధికాలు ఈ దిశగా భారీగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అనేక విమర్శలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలకు సుమారు రూ.కోటి వరకూ బిల్లులు చేయడానికి కిందిస్థాయి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని, బెదిరిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కొత్త సీఈఓ బాధ్యతలు స్వీకరించేలోగా పని పూర్తి చేయాలని, పాత బిల్లులను చేసేసి జేబులు నింపుకోవాలని కొందరు ఉన్నతాధికారులు ఎత్తులు వేస్తున్నారని తెలిసింది.

నిర్బంధించే ప్రయత్నాలు...?

జడ్పీలో ఓ ఉన్నతాధికారి కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేల సంస్థల ఆపరేట్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) బిల్లులు చేసేందుకు శుక్రవారం సిద్ధమైనట్లు సమాచారం. ఈ క్రమంలో అకౌంట్స్ విభాగంలోని ఓ అధికారిని తన చాంబర్‌కు పిలిపించి, సెల్ ఫోన్ లాక్కుని బిల్లులు చేయాలని ఒత్తిడి చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారం జడ్పీలో చర్చనీయాంశంగా మారింది. సంబంధిత డి-సెక్షన్‌లో క్లర్క్ లేకపోయినా.. డీపీఓ కార్యాలయానికి చెందిన అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పిలిపించి, ఎలాగైనా బిల్లులు చేయాలని విశ్వప్రయత్నాలు చేసినట్లు సమాచారం. గతంలో జడ్పీ ఉన్నతాధికారులు చేసిన బిల్లులపైనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకం, ఇతర వాటర్ వర్క్స్‌కు సంబంధించి గతంలో లేని కార్మికులు ఉన్నట్లు చూపి కాంట్రాక్టర్లు కోట్ల రూపాయలు బిల్లులు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. సుమారు రూ.4 కోట్ల బిల్లులు చేయడం అప్పట్లో దుమారం రేగింది. సీఐటీయూ, సీపీఎం నాయకులు పెద్దఎత్తున ధర్నాలు కూడా చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఇలా అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సంస్థలకు మళ్లీ ఆగమేఘాల మీద బిల్లులు చేసేందుకు జడ్పీలో ఉన్నతాధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాజాగా కొత్త సీఈఓను ప్రభుత్వం నియమించింది. కొత్త సీఈఓ చేరేలోగా తమకు అనుకూలంగా ఉండే అధికార పార్టీ కాంట్రాక్టర్ల బిల్లులు చేసేందుకు కొందరు ఉన్నతాధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో అకౌంట్స్ విభాగంలోని ఓ అధికారిపై ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నెల 17న జడ్పీ సర్వసభ్య సమావేశం ఉంది. ఈ నేపథ్యంలో జడ్పీ ఉన్నతాధికారుల తీరు, దూకుడు వ్యవహారాలు ఎక్కడికి దారి తీస్తాయో, జడ్పీ పాలకవర్గం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.



వారికంటే ఘనుడు!

ఓ సర్కిల్ పోలీసు అధికారిపై అవినీతి ఆరోపణలు

- ఫిర్యాదు చేయాలంటే డబ్బుతో వెళ్లాల్సిందేనట
- అధికార పార్టీ ఎమ్మెల్యేల క్లాస్‌మేట్ అని ప్రచారం
- దుష్ట చతుష్టయం ద్వారా బేరసారాలు.. వసూళ్లు..?
- అధికార పార్టీవారూ ముడుపులు కట్టాల్సిందేనట..!




తాడిపత్రి, జనవరి 12: పోలీస్ స్టేషన్‌లకు ఎవరైనా సమస్యలతో వెళతారు. కానీ ఆ స్టేషన్‌కు సమస్యలతోపాటు డబ్బుతోనూ వెళ్లాల్సిందే అన్న ప్రచారం జరుగుతోంది. శింగనమల నియోజకవర్గంలోని ఓ సర్కిల్‌లో పని చేసిన ఇద్దరు అధికారులు అవినీతి ఆరోపణలతో వెళ్లిపోయారు. వారి తరువాత వచ్చిన అధికారి వారికంటే రెండాకులు ఎక్కువే చదివాడని బాధితులు వాపోతున్నారు. పని ఏదైనా.. పైసలు ఇవ్వాల్సిందే అంటున్నాడని, డబ్బులు ఇచ్చినా న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని అంటున్నారు. అందుకే చాలామంది ఆయన వద్దకు వెళ్లడమే మానేశారు. అయినా ఆ అధికారి వదలడం లేదట. 'మీరు ఫిర్యాదు చేయకుంటేమాత్రం.. నాకు తెలియదా..?' అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని.. అటువైపు వారిని పిలిపించి బెదిరించి మరీ డబ్బులు గుంజుతున్నారని సమాచారం.



అధికార పార్టీవారి స్నేహితుడట..

సర్కిల్ పరిధిలో రాజకీయ పరిస్థితులను ఆ అధికారి బాగా ఆకళింపు చేసుకున్నాడు. బదిలీపై వచ్చీ రాగానే తాను అధికార పార్టీ ఎమ్మెల్యే స్నేహితుడినని, ఆ పార్టీ కీలక నాయకులందరూ తనకు సన్నిహితులేనని ప్రచారం చేసుకున్నాడు. ఒకరిద్దరు తన క్లాస్‌మేట్స్ అని కూడా చెప్పుకుంటున్నాడు. కిందిస్థాయి సిబ్బంది ద్వారా కూడా ఇదే ప్రచారం చేయిస్తున్నాడు. అలా.. రాజకీయంగా ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటున్నాడు. అవినీతి కార్యకలాపాలు శృతిమించినా, తనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి జంకేలా ఎత్తుగడ వేశాడు.

ఆ నలుగురి ద్వారా..




పోలీసు శాఖ సిబ్బందిలో నలుగురికి 'దుష్ట చతుష్టయం' అనే పేరుంది. వారిని తన అవినీతి కార్యకలాపాలకు ఆ అధికారి వినియోగించుకుంటున్నాడని సమాచారం. ఆ నలుగురిపై అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. సెటిల్‌మెంట్లలో వారిది అందెవేసిన చేయి అంటారు. ఇలాంటి చరిత్ర ఉన్న ఆ నలుగురిని ప్రయోగించి.. అక్రమ సంపాదనకు తెరలేపారని ప్రచారం జరుగుతోంది. తన పరిధిలో చీమ చిటుక్కుమన్నా ఆ నలుగురు కనిపెట్టి ఆ అధికారి సమాచారం ఇస్తారట. స్టేషన్‌కు వచ్చేవారిని పలకరించి, న్యాయం చేస్తామని ఆ నలుగురి ద్వారా బేరం పెడుతున్నారట. డబ్బు ఇచ్చేందుకు ఒప్పుకున్నవారి వివరాలను ఆ అధికారికి ఇస్తారని, మొదట కొంత అడ్వాన్సుగా తీసుకుంటారని సమాచారం. మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో తిరిగి నేరాలను, సమస్యలను గుర్తించడం, అందుకు కారణమైనవారిని స్టేషన్‌కు పిలిపించడం, లేదా అక్కడే సెటిల్‌మెంట్లు చేయడం దుష్టచతుష్టయం దినచర్య అని అంటున్నారు.

హత్య కేసు నిందితులకు అండ



కొన్నిరోజుల క్రితం యల్లనూరు మండలంలోని ఓ గ్రామంలో టీడీపీ మద్దతుదారుడి హత్య జరిగింది. ఈ కేసులో నిందితులైన అధికార పార్టీవారికి ఆ అధికారి అండగా నిలిచారన్న ఆరోపణలు ఉన్నాయి. నిందితుల కుటుంబ సభ్యులపై ఈగ వాలకుండా చూసుకొనేందుకు ఆ అధికారికి రూ.లక్షకు పైగా ముట్టిందన్న ప్రచారం జరుగుతోంది. హత్య కేసు నిందితులను అరెస్టు చేసిన వెంటనే కొందరు వైసీపీ నేతలు ఆ అధికారికి ఫోన్‌చేసి, తమవారిని బాగా చూసుకోవాలని కోరినట్లు సమాచారం. 'సరే.. ఓ లక్ష పంపండి..' అని ఆయన బేరంపెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితులను చితకబాదానని స్టేషన్ బయట చెప్పుకున్న ఆయన.. లోపల మాత్రం రాచ మర్యాదలు చేయించాడని ప్రచారం ఉంది. యల్లనూరు మండలంలో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఫ్యాక్షన్‌కు ఈ హత్య ఆజ్యం పోసినట్లయింది. భూతగాదాను అడ్డుగా పెట్టుకొని టీడీపీ మద్దతుదారున్ని హత్యచేసిన కేసులో నిందితులకు సకల మర్యాదలు చేయడం విమర్శలకు తావిస్తోంది. డబ్బులు ఇస్తే నేరాలు చేసినా ఇబ్బంది ఉండదేమో అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరించకపోతే మునుపటి ఫ్యాక్షన్ పరిస్థితులు పునరావృతమౌతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రేమ.. పైసా..



ఆ అధికారి పరిధిలోని మండల కేంద్రంలో ప్రేమికుల జంట కొన్ని రోజుల క్రితం ఎగిరిపోయింది. అమ్మాయి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో.. వెతికి జంటను పట్టుకున్నారు. అమ్మాయిని తల్లిదండ్రులకు అప్పగించేందుకు బేరం పెట్టారు. డబ్బులు ఇవ్వకపోతే తాము ఈ విషయంలో ఏమీ చేయలేమని తేల్చిపోయారట. దీంతో కూతురు కోసం తల్లిదండ్రులు అడిగినంత డబ్బు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

వైసీపీ నేతలదే హవా



తన అవినీతికి అడ్డులేకుండా ఉండేందుకు ఆ అధికారి వైసీపీ నాయకులు చెప్పిన ప్రతి పనీ చేస్తున్నారట. అధికార పార్టీవారు చెబితే చాలు ఆ పోలీస్‌స్టేషన్‌లో పనులు చకచకా జరిగిపోతాయని అంటున్నారు. కానీ, వారికి కూడా ఉచితంగా పనులు జరగవని, చదివింపులు ఉండాల్సిందేనని అంటున్నారు. అడిగినంత డబ్బులిస్తే పనులు వేగంగా జరగడంతోపాటు తిమ్మిని బమ్మిని చేస్తారని అంటున్నారు. ఈ విషయం తెలిసిన పలువురు.. పనులకోసం అధికార పార్టీవారి సిఫార్సుల కోసం ఎగబడుతున్నారు. మరికొందరు దుష్టచతుష్టయం వద్దకు వెళ్లి పనులు చేయించుకుంటున్నారని సమాచారం.

అంగన్‌వాడీల కోసం జైలుకైనా వెళతాం

రౌండ్ టేబుల్ సమావేశంలో టీడీపీ , వామపక్ష నాయకులు




మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 12: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా జైలుకు వెళ్లేందుకూ సిద్ధమని టీడీపీ, వామపక్ష నేతలు అన్నారు. అంగన్‌వాడీల సమ్మెతో రాష్ట్ర ప్రభుత్వం బెంబేలెత్తిపోతోందని అన్నారు. అందుకే ఎస్మాను ప్రయోగించిందని మండిపడ్డారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఇండ్ల ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నరసింహులు, జీఎం బాషా, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు గాంధీ తదితరులు హాజరయ్యారు.

- అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించి నోటీసులు జారీ చేయడం రాష్ట్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిదర్శనమని రాంభూపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా సమ్మెచేసే పరిస్థితులను ప్రభుత్వమే కల్పించిందని అన్నారు. నాలుగు దఫాలుగా చర్చలు జరిపినా వేతనం పెంపుదల గురించి మాట్లాడకపోవడం వల్లే సమ్మె కొనసాగుతోందని అన్నారు. సమ్మెను అణచివేసేందుకు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టడం, ఐసీడీఎస్ అధికారులు, కొందరు ఎమ్మెల్యేలు, అధికారపార్టీ నాయకుల ద్వారా బెదిరింపులకు పాల్పడటం దారుణమని అన్నారు. అంగన్‌వాడీల సమ్మెను అణచివేసి.. భవిష్యత్తులో కార్మికులు, ఉద్యోగులు సమ్మెలు చేయకుండా చూడాలని ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎస్మా చట్టాన్ని వెంటనే రద్దు చేసి అంగన్‌వాడీల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నియంతృత్వ వైఖరికి నిరసనగా రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ప్రత్యక్ష ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు.
- అంగన్‌వాడీలు చేస్తున్న పోరాటం చాలా గొప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులను బెదరగొట్టిన ప్రభుత్వాన్ని అంగన్‌వాడీలు ధైర్యంగా ఎదుర్కొంటున్నారని అన్నారు. తన పార్టీలోని అసంతుష్టులను బుజ్జగించడానికే ముఖ్యమంత్రికి సమయం సరిపోతోందని, ప్రజల కష్టాలను పట్టించుకునే పరిస్థితిలో ఆయన లేరని విమర్శించారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకుడు చంద్రశేఖర్, ఎస్‌యూసీఐ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర, సీపీఎం నాయకుడు నల్లప్ప, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, రైతు సంఘం జిల్లా నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, ఆవాజ్ జిల్లా కార్యదర్శి ముష్కిన్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు, ప్రజలందరి పార్టీ నాయకుడు వెంకటసుబ్బయ్య ప్రజా గాయకుడు ఆదినారాయణ, నిరుద్యోగుల ఐక్యవేదిక నాయకులు రామన్న తదితరులు పాల్గొన్నారు.

కందిపోయింది..!

- జిల్లాలో భారీగా తగ్గిన కంది దిగుబడి
- వర్షాభావంతో ఎండిన పంట
- ధరలున్నా కొనేవారు లేక రైతుల ఎదురుచూపు
- అన్నదాతకు తప్పని ఆవేదన





యాడికిలో దిగుబడి లేని కంది పంట

అనంతపురం అర్బన్/యాడికి/ఉరవకొండ, జనవరి 12: కంది రైతుకు కష్టమొచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన కంది పంట వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భారీగా దిగుబడి తగ్గింది. అరకొరగా దిగుబడి రావడంతో పెట్టుబడులు కూడా రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు.

వర్షాలు లేక ఎండిన పంట

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 30వేల హెక్టార్లల్లో కంది పంట సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు పడకపోవడంతో పంట సాగు విస్తీర్ణం తగ్గింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొందరు రైతులు తమ పొలాల్లో కందిని ఏక పంటగా సాగు చేశారు. మరికొందరు వేరుశనగ పంటతో కలిసి సాళ్లుగా వేసుకున్నారు. కంది పంట బాగా పండితే ఎకరాకు 6 నుంచి 9 క్వింటాళ్లదాకా దిగుబడి వస్తుంది. ఈసారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎకరాకు 2 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. మరికొన్నిచోట్ల ఎండిపోవడంతో దిగుబడి శూన్యంగా మారింది.

దిగుబడి తగ్గినా ధర పతనం

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగైన కంది పంటలో ఇప్పటి దాకా 70 శాతం పంట కోత పూర్తయ్యింది. మరోవారం రోజుల్లో మిగతా విస్తీర్ణంలో పంట కోత పూర్తికానుంది. ఈ సారి పంట దిగుబడి భారీగా తగ్గింది. మరోవైపు ఎకరా పంట సాగు కోసం రూ.15వేల నుంచి రూ.20వేలు పెట్టుబడి పెట్టారు. సాధారణంగా పంట దిగుబడి తగ్గితే ధరలు పెరుగుతాయి. అయితే కంది పంట విషయంలో అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. నెలరోజుల క్రితం కంది క్వింటాల్ రూ. 13వేలు పలికింది. ప్రస్తుతం క్వింటా రూ.7వేలకు తగ్గింది. దళారులు కుమ్మక్కై పంట ధరను తగ్గించినట్లు సమాచారం. ప్రభుత్వం మద్దతు ధరతో కంది పంటను కొనుగోలు చేయడంపై దృష్టి సారించలేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఉంటే ధరలు తగ్గే పరిస్థితి ఉండేది కాదన్నది బాధిత రైతుల వాదన. కంది క్వింటాల్ కనీస మద్దతు ధర రూ.7వేలుగా ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కనీస మద్దతు ధర రేటు ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే మరింతగా దళారులు బహిరంగ మార్కెట్‌లో తగ్గించి సొమ్ము చేసుకునే ప్రమాదం లేకపోలేదు. అసలే దిగుబడి తక్కువ కావడంతో పెట్టుబడి ఖర్చులు కూడా దక్కవని రైతులు వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని కంది కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేసేలా చొరవ చూపాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే రైతులు మరింతగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు. పాలకులు ఏ మేరకు చొరవ చూపుతారో వేచిచూడాల్సిందే.

దిగుబడి తగ్గింది..



మూడెకరాల్లో కంది పంట సాగు చేశా. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెట్టా. ఈ సారి వర్షాలు సరిగాపడకపోవడంతో ఎకరాకు 2 క్వింటాళ్లలోపే దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఈసారి పూర్తిగా నష్టపోయాం. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- వెంకటనాయుడు, యాడికి

పెట్టుబడి కూడా రాదు..



10ఎకరాల్లో కంది పంట సాగు చేశా. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎకరాకు రెండు క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదు. పెట్టుబడి రూ.20వేలదాకా ఖర్చు అయింది. ఈసారీ భారీ నష్టాలు తప్పలేదు.

- అల్లెప్ప, రైతు, ఉరవకొండ

కొనే వారే లేరు..



కొనే వారు లేక పంటలు కల్లాలోనే రాశులు పోసుకుని ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. వర్షాలు సరిగ్గా పడకపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

- అశోక్, రైతు, ఉరవకొండ

రూ.70 వేలు పెట్టా..



ఐదు ఎకరాల్లో కంది పంట సాగు చేశా. దాదాపు రూ.70వేలు పెట్టుబడి పెట్టా. రెండు క్వింటాళ్లు కావడం కూడా రాక పోవడంతో నిలువునా నష్టపోయా..

- రాంభూపాల్‌రెడ్డి, రైతు పిన్నేపల్లి, యాడికి మండలం

త్వరలో కంది కొనుగోలు కేంద్రాలు



మాట్లాడుతున్న ఏడీ రవి

అనంతపురం రూరల్, జనవరి 12: ప్రభుత్వం త్వరలో కంది పంట కొనుగోలుకు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని అనంతపురం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు రవి తెలిపారు. శుక్రవారం మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. రబీలోపంట సాగు చేసిన రైతులు ఈ పంట నమోదు చేసుకోవాలని, ఈకేవైసీ చేయించుకోవాలని అన్నారు. కంది పంట కొనుగోలు నేపథ్యంలో సదరు రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంక్ లింక్‌లేని రైతులు అకౌంట్ లింక్ చేయించుకోవాలన్నారు. వ్యవసాయాధికారిని సాయిలక్ష్మి, ఏఈఓ మురళికృష్ణ, అలేఖ్య, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆలమూరు సుబ్బారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



ఉరవకొండలో కందులను కల్లాల్లో ఆరబోసిన రైతులు



మీడియాతో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రెడ్డి

15 నుంచి బండలాగుడు పోటీలు

దక్ష కన్‌స్ట్రక్షన్ అధినేత ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి

అనంతపురంరూరల్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలోని ఎ.నారాయణపురంలో సోమవారం నుంచి రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు దక్ష కన్‌స్ట్రక్షన్ అధినేత ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎ.నారాయణపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఏటా పెద్ద ఎత్తున ఈ పోటీలు నిర్వహిస్తున్నామని, ఈఏడాదీ అదే రీతిలో పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. రెండు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని, న్యూకేటగిరి, సీనియర్ ఎద్దుల విభాగాల్లో పోటీల నిర్వహణ ఉంటుందని అన్నారు. న్యూ కేటగిరి విభాగంలో మొదటి బహుమతి యునికాన్ బైక్, సీనియర్ విభాగంలో మొదటి బహుమతి రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ ఇస్తామని అన్నారు. తొమ్మిదవ స్థానం వరకు నగదు బహుమతులు ఇస్తున్నామన్నారు. గుర్రపు స్వారీ నిర్వహణ కూడా ఉంటుందన్నారు. ఈ పోటీలకు ప్రజాప్రతినిధులతో పాటు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డి హాజరవుతారన్నారు. పోటీల వీక్షణకు వచ్చే వారికి భోజన సదుపాయం కల్పించామన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

పదవీ కాలం పొడిగింపు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: సహకార సొసైటీలు, ఏడీసీసీ బ్యాంకు, డీసీఎంఎస్‌ల పాలకవర్గాల పదవీకాలం గడువు ఆరు నెలల పాటు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర సహకార ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చిరంజీవి చౌదరి జీఓ నంబర్లు 28, 31లను శుక్రవారం జారీ చేశారు. ఈనెల 18తో ముగియనున్న సహకార సొసైటీల పదవీకాలాన్ని జూలై 17 వరకు పొడిగించినట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తద్వారా మరోసారి సహకార సొసైటీల ఎన్నికలు వాయిదా పడినట్లైంది. సాధారణ ఎన్నికల తరువాతే సహకార ఎన్నికలు ఉండవచ్చని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న నందిత



అవార్డు అందజేస్తున్న ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్

అనంతపురం సెంట్రల్, జనవరి 12: ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ వలంటీర్‌గా రాష్ట్రస్థాయి పురస్కారానికి ఎంపికైన ఆర్ట్స్ కళాశాల విద్యార్థి నందిత శుక్రవారం పురస్కార అవార్డును అందుకున్నారు. విజయవాడలో నిర్వహించిన సమావేశంలో ఎన్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధికారి అశోక్‌రెడ్డి, కళాశాలల ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ నందితను అభినందించి అవార్డులను అందజేశారని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విష్ణుప్రియ తెలిపారు. ఈ సందర్భంగా నందితను ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శశాకంకమౌళి తదితర అధికారులు నందితను అభినందించారు.

20 నుంచి అనంత చిరుధాన్యాల పండుగ

- ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి



మాట్లాడుతున్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవి మల్లారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: 'మన పంటలు-మన వంటలు' అనే నినాదంతో ఈనెల 20వతేదీ నుంచి అనంత చిరుధాన్యాల పండుగ ప్రదర్శన జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవీ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏఎఫ్ ఎకాలజీసెంటర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ స్వచ్ఛందసంస్థలు, వ్యవసాయ పరిశోధన సంస్థలు, సామాజిక స్పృహ కలిగిన వ్యాపారుల సంయుక్త సహకారంతో ఈనెల 20, 21, 22వ తేదీల్లో మూడు రోజుల పాటు అనంత చిరుధాన్యాల పండగ-2024 నిర్వహిస్తామన్నారు. మొదటి రోజుప్రారంభోత్సవం, చిరుధాన్యాలతో ఆరోగ్యం, వాతావరణ మార్పులు అరికట్టే చిరుధాన్యాల సాగు అంశాలపై సదస్సు ఉంటుందన్నారు. రెండో రోజు చిరు ధాన్యాల సాగులో మెలకువలు, సహభాగ ధ్రువీకరణ పద్ధతి, స్వల్పకాలిక చిరుధాన్యాల రకాల సాగుపై వివరిస్తారన్నారు. చివరి రోజు చిరుధాన్యాల ప్రాసెసింగ్-విలువ ఆధారిత ఉత్పత్తులు అంశంపై శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మూడు రోజుల పాటు కళాకారుల బృందం పల్లెపాటలు, నాటికలు, తోలు బొమ్మలాటల ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రజల సంపూర్ణ ఆరోగ్యం, రైతుల సుభిక్షం కోసం ఆకాంక్షించే వారందరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పెద్దనే హత్య చేయించారు..

వృద్ధుడి హత్య కేసులో భార్య, కుమారుడు, కుమార్తె అరెస్టు



అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న సీఐ యతీంద్ర

ముదిగుబ్బ, జనవరి12: ఆస్తి కోసం ఇంటి పెద్దనే సుపారీ హత్య చేయించారు. భార్య, కుమారుడు, కుమార్తె జైలు పాలయ్యారు. ముదిగుబ్బ మండలం నాగారెడ్డిపల్లికి చెందిన పాపిరెడ్డి(60) మృతి మిస్టరీని పోలీసులు ఛేదించారు. శుక్రవారం పట్నం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ యతీంద్ర కేసు వివరాలను వెల్లడించారు. పాపిరెడ్డి పేరిట నాగారెడ్డిపల్లి వద్ద కొంత భూమి ఉంది. ఆ భూమిని తన కూతురు పేరిట రాయించమనీ, మరికొంత భూమిని అమ్మి వారు కొత్తగా నిర్మించుకున్న ఇంటి కోసం చేసిన అప్పులు తీర్చాలని లక్ష్మీదేవి, కూతురు చెరుకు తేజావతి, కుమారుడు వెంకటేశ్వర రెడ్డి అడిగారు. అందుకు అతడు ఒప్పుకోకపోవడమే కాకుండా, తాగి వచ్చి వారిని వేధిస్తుండేవాడు. పాపిరెడ్డి అడ్డు తొలగించుకోవాలనుకున్నారు. అదే గ్రామానికి చెందిన శివారెడ్డి, జయరాములుతో రూ.1.70 లక్షలకు సుపారీ కుదుర్చుకున్నారు. పథకం ప్రకారం గతేడాది నవంబరు 10వ తేదీన శివారెడ్డి, జయరాములు.. నాగారెడ్డిపల్లి సమీపంలోని మద్దిలేరు వాగు వద్దకు పాపిరెడ్డిని తీసుకెళ్లారు. మద్యం తాగించి, మత్తులో ఉన్న అతడి తలపై ఇద్దరూ కలిసి రాయితో మోది, హత్య చేశారు. రాత్రి 10 గంటల సమయంలో కుంట మధ్యలో ఉన్న జమ్ములో మృతదేహాన్ని దాచిపెట్టారు. పాపిరెడ్డి గత నవంబరు నుంచి కనిపించట్లేదని అతడి అన్న కృష్ణారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జనవరిలో మిస్సింగ్ కేసు నమోదు చేసి, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానిత వ్యక్తులను విచారిస్తుండగా పాపిరెడ్డి భార్య లక్ష్మీదేవి, కూతురు చెరుకు తేజావతి, కుమారుడు వెంకటేశ్వర రెడ్డి, అదే గ్రామానికి చెందిన శివారెడ్డి, జయరాములు ఈనెల 10న వీఆర్వో ద్వారా ముదిగుబ్బ సీఐ ఎదుట లొంగిపోయారు. నిందితులు తెలిపిన ప్రదేశానికి వెళ్లి పాపిరెడ్డి మృతదేహాన్ని వెలికి తీసి, అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. నిందితులు ఐదుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ఉద్యోగావకాశాలు పెంచడమే ధ్యేయం

- కలెక్టర్ గౌతమి



పోర్టల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం టౌన్, జనవరి 12: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు పెంచడమే ధ్యేయంగా కొత్త ఎంప్లాయ్‌మెంట్ వెబ్‌సైట్ పోర్టల్‌ను ప్రారంభించామని కలెక్టర్ గౌతమి అన్నారు. జిల్లా ఉపాధి కల్పనాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్ పోర్టల్ పోస్టర్లను క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ employment.ap.gov.in పోర్టల్‌ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి అవకాశాల సమాచారం తెలుసుకొని వాటికి ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టెన్త్, డిగ్రీ, డిప్లమా ఇలా ఏ కోర్సులు చేసినా ఇందులో నమోదు చేసుకోవచ్చన్నారు. ఈసేవలు అన్ని జిల్లాల ఎంప్లాయ్‌మెంట్‌సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు, అభ్యర్థుల మొబైల్స్‌ద్వారా కూడా పొందవచ్చన్నారు. ఈవెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసిన వెంటనే, తాత్కాలిక రిజిస్ట్రేషన్ నెంబర్ మెసేజ్ ద్వారా పంపబడుతుందని, సంబంధిత జిల్లా ఎంప్లాయ్ అధికారి ఆమోదించిన వెంటనే వారికి ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్ నెంబరు తెలియజేయబడుతుందన్నారు. అభ్యర్థి తన ఎంప్లాయ్‌మెంట్‌కార్డు లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయం కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 2001.75 మెట్రిక్ టన్నుల ఎరువులు

అనంతపురం అర్బన్, జనవరి 12: జిల్లాకు 2001.75 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా అయినట్లు అనంతపురం ఏడీఏ రవి శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో డీఏపీ 1624.75 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 రకం ఎరువులు 377 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు.

సామూహిక షష్టిపూర్తికి దరఖాస్తు చేసుకోండి

- బ్రాహ్మణ సంఘం చైర్మన్ సీఎస్‌కే శేషగిరిరావు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘాల నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 12: అఖిల భారత బ్రాహ్మణ కల్యాణోపాధ్యాయ వివాహ సమాచార కేంద్రాల సంఘం (ఎఫ్ఓబీఎంఐఎస్) ఆధ్వర్యంలో తిరుపతిలోని కంచి పీఠంలో ఈ నెల 28న నిర్వహించనున్న ఉచిత సామూహిక షష్టిపూర్తి, భీమరథ శాంతి కోసం అర్హత గల బ్రాహ్మణులు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం చైర్మన్ సీఎస్‌కే శేషగిరిరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. 60 సంవత్సరాలు నిండిన బ్రాహ్మణ దంపతులు షష్టిపూర్తికి, ఉగ్రరథ శాంతి, భీమరథశాంతి కోసం 70 సంవత్సరాలు నిండిన వారు ఈనెల 18వ తేదీలోపు 94409 22668 నంబరులో సంప్రదించి, పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమానికి రాష్ట్రంతోపాటు జాతీయ స్థాయిలో బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఓబీఎంఐఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధులు ఆలూరు లక్ష్మీ నరసింహశాస్త్రి, నార్పల మారుతి, నాగభూషణరావు, మదనపల్లి మురళీధర్, పట్నం శివేశ్వరరావు, నీరజ, పార్నంది జ్యోతి, లక్ష్మీనరమ్మ పాల్గొన్నారు.

జాతీయ కబడ్డీ పోటీలకు హిమజ



హిమజకు క్రీడాదుస్తులు అందిస్తున్న డీఎస్‌డీఓ నరసింహారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలకు జిల్లాకు చెందిన దాసరి హిమజ ఎంపికైంది. ఇటీవల అన్నమయ్య జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలలో ఉత్తమ ప్రదర్శనతో ఆకట్టుకున్న కేఎస్ఎస్ బాలికల ప్రభుత్వ పాఠశాల 9వతరగతి విద్యార్థి హిమజ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఎంపికైన హిమజను డీఎస్‌డీఓ నరసింహారెడ్డి శుక్రవారం స్థానిక డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో సన్మానించి అభినందించారు. ఈనెల 17వతేదీ నుంచి 27వతేదీ వరకు నిర్వహించే జాతీయ శిక్షణ శిబిరంలో పాల్గొనే హిమజ ఈనెల 28వతేదీ నుంచి రాజంపేటలో నిర్వహించే కబడ్డీ పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనుంది. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్ సంధ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ, హిమజ తల్లిదండ్రులు లావణ్య, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమాన హోదా, హక్కులు కల్పించండి

ఎంఈఓ-2 యూనియన్ నాయకుల డిమాండ్



సమావేశమైన ఎంఈఓ-2లు

అనంతపురం విద్య, జనవరి 12: ఎంఈఓ-1తో సమాన హోదా, హక్కులను తమకూ కల్పించాలని ఎంఈఓ-2 యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఉపాధ్యాయభవన్‌లో శుక్రవారం ఎంఈఓ-2ల సమావేశం నిర్వహించారు. కొన్ని మండలాల్లో ఎంఈఓ-1లు.. ఎంఈఓ-2లకు సహకరించడం లేదన్నారు. జిల్లా విద్యాశాఖ ఎండీఎం, సమగ్రశిక్ష ఐటీ సెల్ విభాగం అధికారులు ఎంఈఓ-2లకు మాత్రమే ఫోన్లు చేసి ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఐటీ సెల్, సమగ్రశిక్ష అధికారులు ఎంఈఓ-2లతోనేకాకుండా ఎమ్మార్సీ సిబ్బందితో కూడా మాట్లాడాలని అన్నారు. కొత్తగా ఈ పోస్టులు సృష్టించారని, ఈ క్రమంలో విధులు సజావుగా నిర్వర్తించడానికి ఒక కంప్యూటర్, ప్రింటర్, ఫర్నిచర్‌ను ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు, ఐఈఆర్పీల జీతాల క్లెయిమ్స్, వర్క్‌డన్ స్టేట్‌మెంట్స్‌పై ఎంఈఓ-2 సంతకాలు ఉండేలా ఆదేశాలివ్వాలని డిమాండ్ చేశారు. తమ జీతాలు, ఇంక్రిమెంట్ల బిల్లులు డిప్యూటీ డీఈఓల సహకారంతో ఏడీ-1 నుంచి త్వరగా మంజూరయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎంఈఓ-2లు గురుప్రసాద్, లింగానాయక్, ఓబుళపతి, భవానీ శంకర్, నారపరెడ్డి, రామాంజనేయులు, వాణీదేవి, సరిత రాణి, రమాదేవి, తిప్పేస్వామి, కృష్ణానాయక్, బాబు, శివప్రసాద్, బాషా, రామగోవింద్, హరికృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో ఉద్రిక్తత

- వలంటీర్లు పాల్గొనడంపై అభ్యంతరం
- ఆటే ముఖ్యం.. ఇద్దరు వలంటీర్ల రాజీనామా



అధికారులతో వాగ్వాదం చేస్తున్న క్రీడాకారులు

యాడికి, జనవరి12: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. యాడికి, వేములపాడు జట్ల మధ్య క్రికెట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించడానికి హైస్కూల్ మైదానంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. వేములపాడు జట్టులో నిబంధనలకు విరుద్ధంగా ముగ్గురు వలంటీర్లు ఉన్నారని యాడికి జట్టు అభ్యంతరం తెలిపింది. తాము తొలి మ్యాచ్ నుంచి ఆడుతూనే ఉన్నామని అప్పుడులేని అభ్యంతం ఇప్పుడెందుకని వేములపాడు జట్టు ఆటగాళ్లు (వలంటీర్లతో కలిసి) అధికారులతో తీవ్రంగా వాదించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఫైనల్‌మ్యాచ్ ఎలా నిర్వహించాలో దిక్కుతోచక అధికారులు చేతులెత్తేశారు. అయితే వలంటీర్లను ఆడకుండా అడ్డుకుంటే వేములపాడు పంచాయతీలోని 16మంది వలంటీర్లు రాజీనామా చేస్తామని అధికారులను హెచ్చరించారు. పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిచెప్పినా ఇరుజట్ల సభ్యులు వినలేదు. కొట్టాలపల్లి వైసీపీ నాయకుడు ప్రసాద్‌రెడ్డి వేములపాడు జట్టుకు మద్దతు తెలిపి అధికారులతో వాదనకు దిగారు. జట్టులో ఉన్న ముగ్గురు వలంటీర్ల చేత విధుల నుంచి వైదొలుగుతున్నట్లు ఉత్తరం రాసి ఎంపీడీఓకు ఇవ్వడానికి వెళ్లారు. అయితే అధికారులు మాట దాటవేసి అక్కడి నుంచి తప్పుకున్నారు. ఫైనల్‌మ్యాచ్ నిర్వహణలో అధికారుల తీరుపై ఇరుజట్ల క్రీడాకారులు అసహనం వ్యక్తం చేశారు. ఒకానొక దశలో ఎమ్మెల్యే పీఏ నుంచి ఫోన్ వచ్చిందని, వలంటీర్లు రాజీనామా చేస్తే మరలా తీసుకోమని, ఆట కొనసాగేటట్లు చూడాలని చెప్పినట్లు క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మ్యాచ్ కంటే వలంటీర్ ఉద్యోగం ముఖ్యం కాదని తేల్చి చెప్పారు.

ఇద్దరు వలంటీర్ల రాజీనామా

'మాకు క్రికెట్ ఆటే ముఖ్యం... మీ వలంటీర్ ఉద్యోగం కాదు' అంటూ వేములపాడులో ఎల్లారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి అనే ఇద్దరు గ్రామ వలంటీర్లు ఉద్యోగానికి శుక్రవారం రాజీనామా చేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా ఎల్లారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి తమ పోస్టులకు రాజీనామా చేస్తున్నట్లు లెటర్ అందజేసిన మాట వాస్తవమేనని తెలిపారు.



వివరాలు ఆరాతీస్తున్న పోలీసులు

మద్యపాన నిషేధం హామీ మరచిన జగన్

నార్పల, జనవరి 12: గత ఎన్నికల్లో మద్యపాన నిషేధం చేస్తానని జగన్‌రెడ్డి మాట ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఆ మాట తప్పాడని మహిళా సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పార్వతి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తిక్కయ్యస్వామి ఆలయంలో ఆమె మాట్లాడుతూ.. జగన్ హామీకి విరుద్ధంగా ప్రస్తుతం రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందన్నారు. సీఎం జగన్ లోకల్ బ్రాండ్ల మద్యం అమ్ముతూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలోని మహిళలంతా వైసీపీ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య కార్యదర్శి అరుణమ్మ, మండల సమాఖ్య కార్యదర్శులు పెద్దక్క, పూజారమ్మ పాల్గొన్నారు.

తక్కువ నీటితో పండే పంటలను సాగుచేసుకోండి

గార్లదిన్నె, జనవరి 12: తక్కువ నీటితో పండే పంటలను మాత్రమే సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి (జేడీఏ) ఉమామహేశ్వరీ రైతులకు సూచించారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. హెచ్ఎల్సీ కాలువకు, పెన్నానదికి సాగునీరు ఇవ్వకపోవడంతో వరి సాగు పూర్తి తగ్గిపోయిందని అన్నారు. సాగునీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రమేష్, వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, వీఏఏ, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ సిబ్బందికి ఉపాధ్యాయుల చేయూత



ఎమ్మార్సీ సిబ్బందికి ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చెన్నేకొత్తపల్లి : స్థానిక ఎమ్మార్సీ సిబ్బందికి మండలంలోని ఉపాధ్యాయులు తమవంతు చేయూత అందించారు. తమ డిమాండ్ల సాధన కోసం ఎమ్మార్సీ సిబ్బంది 22 రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్నారు. దీంతో సిబ్బంది పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు రూ.46,100 శుక్రవారం విరాళంగా అందజేశారు. ఉపాధ్యాయులకు ఎమ్మార్సీ సిబ్బంది ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



మహిళకు నగదు బహుమతిని అందజేస్తున్న టీసీ వరుణ్

అనంతపురంరూరల్, జనవరి 12: మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ ఏఎస్ఆర్ నగర్ సర్కిల్‌లో జనసేన జిల్లా అధ్యక్షుడు, అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి టీసీ వరుణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనసేన రాయలసీమ ప్రాంతీయ మహిళా కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, వీరమహిళలు పద్మావతి, సువర్ణ, సావిత్రమ్మ, దాసరి సరిత, శ్రీవాణి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. మొదటి బహుమతిగా రూ.పది వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 8వేలు, తృతీయ బహుమతిగా రూ.5వేలు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలకు చీరలు అందించారు. కార్యక్రమంలో నాయకులు బాబురావు, మురళీకృష్ణ, జయరాంరెడ్డి, అంకె ఈశ్వరయ్య, చంద్రశేఖర్, నాగేంద్ర, ధనంజయ్, సంజీవరాయుడు, కిరణ్‌కుమార్, సిద్దు పాల్గొన్నారు.

బలిజలకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 12: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బలిజలకు రానున్న ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని, లేకుంటే తమ సత్తా ఏంటో చూపుతామని రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు తొండపునాటి శంకరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బలిజలకు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీరని అన్యాయం జరుగుతోందని అన్నారు. బలిజల ప్రభావాన్ని గుర్తించి అన్ని రాజకీయ పార్టీలు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు బళ్లారి వెంకట్రాముడు, పగడాల మల్లికార్జున, పూల పాండు, నాగభూషణం, కోనేటి సాయిప్రసాద్, రంగనాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో 'శింగనమల' విజయం



విజేతగా నిలిన శింగనమల జట్టు

శింగనమల, జనవరి 12: శింగనమలలో నిర్వహించిన మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీల్లో శింగనమల జట్టు విజయం సాధించింది. నాలుగు రోజుల నుంచి నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొత్తం 13 జట్టు పాల్గొన్నాయి. శుక్రవారం శింగనమల, రాచేపల్లి జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో రాచేపల్లి జట్టుపై ఏడు పరుగు తేడాతో శింగనమల జట్టు విజయం సాధించింది. నియోజకవర్గం స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించింది. ఇందులో ఎంపీడీఓ నిర్మాలదేవి, పంచాయతీ కార్యదర్శిలు రామాంజినేయులు వెంకట రమణ, రామాంజినేయులు, పీఈటీలు నందకుమార్, భైపిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు,

బీజేపీ మండలాధ్యక్షుడిగా ప్రకాష్

అనంతపురం సెంట్రల్, జనవరి 12: ఆత్మకూరు బీజేపీ మండలాధ్యక్షుడిగా ప్రకాష్‌ను నియమించినట్లు రాప్తాడు బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చైతన్య కిషోర్ తెలిపారు. శుక్రవారం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శేఖర్ ప్రకాష్‌కు నియామక పత్రాన్ని అందజేశాడన్నారు.

ఈఓఆర్డీల కార్యవర్గం ఎన్నిక



వెంకటనాయుడు, ఆనంద్‌ప్రసాద్

అనంతపురం న్యూటౌన్, జనవరి 12: జిల్లా ఈఓఆర్డీల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం సభ్యు లు కొందరు ఉద్యోగోన్న తిపై వెళ్లడంతో ఆ స్థానంలో నూతన సభ్యులను ఎన్నుకోవడంలో భాగంగా స్థానిక డీపీఆర్సీ భవనంలో ఈఓఆర్డీల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్ ప్రసాద్, జనరల్ సెక్రటరీగా కమలాబాయి, కోశాధికారిగా సదాశివ, అసోషియేట్ అధ్యక్షుడిగా వెంకటేశులు, ఉపాధ్యక్షులుగా చంద్రమౌళి, శైలజారాణి, జాయింట్ సెక్రటరీలుగా నరసింహారెడ్డి, శివాజిరెడ్డి, సురేష్‌బాబు, మురళీకృష్ణ, న్యాయసలహాదారులుగా రఘురాం రావు, రాష్ట్ర కౌన్సెలర్లగా వెంకటనాయుడు, జిలాన్‌బాషాను ఎన్నుకున్నారు.

గంగలకుంటలో ఆరాధనోత్సవం

రాప్తాడు: గంగలకుంట గ్రామంలో అద్వైత జ్ఞానపీఠం నారాయణస్వామి శాంతి ఆశ్రమంలో 75వ నిత్య అఖండల ఆరాధనోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి శనివారం వరకూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని, శుక్రవారం లోక కళ్యాణం కోసం శాంతి హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి, ఆధ్యాత్మిక భజనలు, ఉపన్యాసాలు, అన్నదానం చేపట్టామన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

అనంతపురం క్రైం, జనవరి 12: స్థానిక నేతాజీనగర్‌కు చెందిన అశోక్‌కుమార్‌పై గత బుధవారం బుడ్డప్పనగర్‌లో అర్ధరాత్రి జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరిని వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. డిష్‌లో పని చేసే స్థానిక విన్సెంట్ ఫెర్రర్‌నగర్‌కు చెందిన గోవిందరాజులును బెంగళూరులో, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఓ బాలుడిని బళ్లారిలో అరెస్ట్ చేశారు. గోవిందరాజులు, అశోక్‌కుమార్ అక్కచెల్లెళ్ల కుమారులు. అశోక్‌కుమార్‌కు గోవిందరాజులు రూ.8 లక్షల వరకు అప్పించాడు. ఎన్నిసార్లు అడిగినా అశోక్‌కుమార్ తిరిగి ఇవ్వలేదు. దీంతో గోవిందరాజులు, డిష్‌లో పని చేసే ఆ బాలుడు బుధవారం రాత్రి అశోక్‌కుమార్‌పై వేటకొడవళ్లతో దాడి చేసి పారిపోయారు. పోలీసులు వారిని శుక్రవారం అరెస్ట్ చేశారు.

న్యాయం అడిగితే షోకాజ్ నోటీసులా...?

పత్రాలు దహనం చేసి అంగన్‌వాడీల నిరసన



గార్లదిన్నెలో షోకాజ్ నోటీసులు దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : న్యాయం కోసం పోరాడితే షోకాజ్ నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని అంగన్‌వాడీలు మండిపడ్డారు. గార్లదిన్నె షోకాజ్ నోటీసులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. వారు చేపట్టిన సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరింది. చెన్నేకొత్తపల్లిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మెను కొనసాగించారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని శింగనమలలో అంగన్‌వాడీలు ధ్యానం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. రాప్తాడులో శుక్రవారం అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు అధికారులు నోటీసులు అతికించారు.



సీకేపల్లిలో దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు, శింగనమలలో ధ్యానం చేస్తూ..

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

రాప్తాడు, జనవరి 12: మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న మాంటిస్సోరి ఎలీట్ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎండీ భరత్, కరస్పాండెంట్ సమీరా జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎండీ భరత్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ ఏడాదిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, క్రీడల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. పాఠశాల ప్రిన్సిపల్ మధు, ప్రధానోపాధ్యాయుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు మాధవీలత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎండీ భరత్, నృత్యం చేస్తున్న విద్యార్థులు

విద్యాసంస్థల్లో సంక్రాంతి సంబరాలు



ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో సంబరాలు, 'అనంతలక్ష్మి కళాశాలలో సంప్రదాయ దుస్తులతో హాజరైన విద్యార్థులు

అనంతపురంరూరల్, జనవరి 12: మండలంలోని రాచానపల్లి సమీపంలోని ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌లో క్రీడా, సంక్రాంతి సంబరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా క్రీడా అభివృద్ధి సంస్థ అధికారి నరసింహారెడ్డి, విద్యాసంస్థల అధినేత చిరంజీవిరెడ్డి, సతీమణి సుశీలరెడ్డి, పాఠశాల ఛైర్మన్ అరుణ్‌కుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ..

అనంతపురం సెంట్రల్ : అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి పండుగ నేపథ్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. భోగిమంటలు వేసి గంగిరెద్దు, గొరవయ్యల వేషాధారణలతో సందడి చేశారు. సంప్రదాయ దుస్తులతో విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఇందులో కళాశాల ఛైర్మన్ అనంతరాముడు, వైస్ ఛైర్మన్ రమేష్‌నాయుడు, ఉమెన్‌సెల్ కన్వీనర్ మాధవి పాల్గొన్నారు.



కృత్రిమకాళ్లు అందజేస్తున్న ముఖ్య అతిథులు

కృత్రిమ కాళ్లు, చేతుల వితరణ

అనంతపురం కల్చరల్, జనవరి 12: వివేకానంద జయంతిని పురస్కరించుకుని భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సాయికృష్ణ ఫంక్షన్ హాల్‌లో 80 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులను ఉచితంగా పంపిణీ చేశారు. భారత్‌వికాస్ పరిషత్ ప్రాంతీయ సంయోజకుడు పరుచూరు రమేష్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లోక్ అదాలత్ జిల్లా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడారు. భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఏటా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తుండటం హర్షించదగ్గ విషయమన్నారు. పరుచూరు రమేష్ బాబు మాట్లాడుతూ... పరిషత్ ఆధ్వర్యంలో 18 సంవత్సరాలుగా ఈ సేవాకార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఆలూరు రామిరెడ్డి, ముత్యాలరెడ్డి, ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ లక్ష్మణ్, భారత్ వికాస్ పరిషత్ జిల్లా కోశాధికారి సుంకు వేణుగోపాల్, కన్వీనర్లు రమణనాయుడు, హరికృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ నిధులు మళ్లిస్తే పోరాటమే

శింగనమల, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం 45 రోజుల క్రితం విడుదల చేసిన రూ.988 కోట్ల పంచాయతీరాజ్ నిధులను మళ్లించడానికి వైసీపీ ప్రభుత్వం యత్నిస్తోందని, ఆ నిధులను పంచాయతీరాజ్ ఖాతాలోని జామ చేయని పక్షంలో దశలవారీగా పోరాటం చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, గుమ్మేపల్లి సర్పంచ్ లలితమ్మ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం వారో ప్రకటన విడుదల చేశారు. వైసీపీ పాలనలో నిధులు లేక గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. మళ్లీ పంచాయతీ రాజ్ నిధులు మళ్లించడానికి యత్నిస్తే తీవ్ర పోరాటాలు తప్పదని హెచ్చరించారు.

ఉపాధి కూలీలకు అదనపు పనిదినాలు కల్పించాలి



డ్వామా కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12: కరవు జిల్లాలో వలసలు నివారించేలా గ్రామీణ ప్రాంతాల ఉపాధి కూలీలకు అదనపు పనిదినాలు కల్పించాలని సీపీఎం అనుబంధ ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూరి, కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక డ్వామా పీడీ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. ఉపాధి కూలీలకు పనిముట్లు, వేసవి అలవెన్సులు, అదనపు వేతనాలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల బిల్లులు రూ.20కోట్లు వెంటనే చెల్లించాలన్నారు. అడిగిన జాబ్‌కార్డుదారులందరికీ ఏడాదికి 200రోజుల పనిదినాలు, రూ.600కనీస వేతనం చెల్లించాలని అన్నారు. పనిచేసేచోట కూలీలకు నీడ, మెడికల్ కిట్లు, మజ్జిగ, నీటి వసతి కల్పించాలన్నారు. రెండుపూటల పని విధానాన్ని రద్దు చేసి పాతపద్ధతిలోనే పని కొనసాగించాలన్నారు. అనంతరం డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాస్కర్‌బాబు, కృష్ణ, నారాయణ, రంగస్వామి, నాగప్ప, నాగలింగయ్య, కరీం, పెద్దయ్య ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

ఏఐఎస్ఈసీ జిల్లా కమిటీ సమావేశం

అనంతపురం సెంట్రల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఈసీ జిల్లా కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఢిల్లీలో నిర్వహించే మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి నూతన కమిటీని ఏర్పాటుచేశారు. ఇందులో ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ(ఏఐఎస్ఈసీ) కేంద్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి సుబ్రమణ్యం, రాష్ట్ర అధ్యక్షుడు వేణుగోపాల్ , నాయకులు శ్రీధర్, సుబ్బన్న, సుదర్శన్, రసూల్ పాల్గొన్నారు.

స్వామి వివేకానందుడికి ఘన నివాళి

అనంతపురం కల్చరల్, జనవరి 12: స్వామి వివేకానంద 161వ జయంతిని పురస్కరించుకుని స్థానిక అశోక్‌నగర్‌లోని వివేకానంద పార్కులో ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యోగాసన పోటీలు నిర్వహించారు. వివేకానంద యోగాకేంద్ర జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి స్వామి వివేకానంద బోధనలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ లక్ష్మణ్, హోమియో వైద్యుడు కుమారయ్య, జిల్లా పౌరసంబంధాల శాఖాధికారి గురుస్వామి, వివేకానంద యోగాకేంద్ర సభ్యులు ఈఎస్ మారుతీప్రసాద్, ప్రసాద్, పుల్లయ్య, తారక రామయ్య, నాగభూషణం, గురురాజరావు, కృష్ణవేణి, రత్నమయ్య, పరమేశ్వరరెడ్డి, చిదంబరయ్య పాల్గొన్నారు.

అనంతపురం క్లాక్‌టవర్ : స్నేహా యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సెంట్రల్ యూనివర్శిటీలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద చిత్రపటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. నాసిక్ నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని లైవ్‌లో వీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అధ్యాపకులు ప్రసాద్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ రమేష్ సుంకర, జాతీయ యువ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో వివేకానంద విగ్రహానికి ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శశాకంకమౌళి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓలు జయలక్ష్మి, బాలాజీనాయక్, సోమశేఖర్, విష్ణుప్రియ, శ్రీనివాసులు, ఏఓ రమణ విద్యార్థులు పాల్గొన్నారు. సెంట్రల్ యూనివర్సిటి, ఏబీవీపీ కార్యాలయంలో వివేకానందుడికి పలువురు నివాళులర్పించారు.



పార్కులో వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం, ఆర్ట్స్ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి



మార్కెట్‌లోకి కారును విడుదల చేస్తున్న దృశ్యం

మార్కెట్‌లోకి సానెట్ ఫేస్ లిఫ్ట్ మోడల్ కారు

అనంతపురంరూరల్, జనవరి 12: నగర శివారు బెంగుళూరు-హైదరబాదు హైవే పక్కనున్న ఎంజీ బ్రదర్స్ కియా షోరూమ్‌లో సరికొత్త సోనెట్ ఫేస్ లిఫ్ట్ మోడల్ కార్లను శుక్రవారం మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. కస్టమర్లతో జ్యోతి ప్రజ్వలన చేయించి కార్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంజీ బ్రదర్స్ కియా సీఈఓ ఆదిత్యమాచాని మాట్లాడుతూ.. సోనెట్ ఫేస్‌లిఫ్ట్ మోడల్ కారు ఎక్స్ షోరూమ్ ధర రూ.7.99 లక్షలతో ప్రారంభం అవుతుందన్నారు. కొత్త వాహనాలకు సంబంధించిన బుకింగ్స్ ప్రారంభమైందని, డెలివరీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ జీఎం ఎల్లప్ప, జనరల్ మేనేజర్ సేల్స్ గిరిప్రసాద్, సేల్స్ మేనేజర్ సుబ్బరామయ్య పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన బండారు శ్రావణి శ్రీ



అనంతపురం అర్బన్, జనవరి 12: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను శింగనమల నియోజకవర్గం ఇన్‌చార్జి బండారు శ్రావణి శ్రీ, టీడీపీ నాయకురాలు బండారు లీలావతి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఉండవల్లిలోని నారాలోకేశ్ నివాసమంలో వారిద్దరు కలిసి యువగళం పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి చేసినందకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఆయనకు ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

'రా కదలి రా'తో వైసీపీలో వణుకు

టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్



అనంతపురం అర్బన్, జనవరి 12: చంద్రబాబు నాయుడు చేపట్టిన రా కదలి రా సభలకు ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందనను చూసి వైసీపీ నేతల్లో వణుకు పుడుతోందని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ అన్యాయం జరిగిందని, రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే అన్ని వర్గాలకు న్యాయంతోపాటు రాష్ట్రం బాగుపడుతుందన్నారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పి, టీడీపీకి పట్టం కట్టాలని ఆయన కోరారు.

నాయీబ్రాహ్మణులకు వైసీపీ ద్రోహం

టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి నాయకులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 12: వైసీపీ పాలనలో సీఎం జగన్‌రెడ్డి నాయీబ్రాహ్మణులకు తీరని ద్రోహం చేశారని టీడీపీ నాయీబ్రాహ్మణ సాధికార సమితి నాయకులు కడియాల కొండన్న మండిపడ్డారు. టీడీపీ బీసీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అనంతపురం అర్బన్ పరిధిలోని లక్ష్మీనగర్, కొవ్వూరు నగర్, ఒకటి, రెండో రోడ్డు తదితర ప్రాంతాల్లో సెలూన్ షాపులకు వెళ్లి టీడీపీ మిని మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి నాయకుడు సురేంద్ర పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి



ప్యాదిండిలో టీడీపీ నాయకుల ప్రచారం

చెన్నేకొత్తపల్లి, జనవరి 12: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయన్ను తిరిగి ముఖ్యమంత్రిగా చేయడానికి అందరు కృషిచేయాలని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ప్యాదిండి, చందమూరు గ్రామాల్లో శుక్రవారం బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులూ.. ఆత్మ పరిశీలన చేసుకోండి: వీసీ

అనంతపురం సెంట్రల్, జనవరి 12: 'మనమంతా మంచి జీతంతో జేఎన్‌టీయూ మీద ఆధారపడి బతుకుతున్నాం... ఉద్యోగానికి వచ్చామా.. వెళ్లామా... అన్నట్లు కాకుండా ఆత్మపరిశీలన చేసుకొని.. సాధ్యమైనంత వర్సిటీ అభివృద్ధికి కృషి చేద్దాం.' అని వీసీ రంగజనార్దన ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం జేఎన్‌టీయూ ఆర్యబట్ట ఆడిటోరియంలో నిర్వహించిన 13వ కాన్వకేషన్ సక్సెస్ మీట్‌లో ఆయన మాట్లాడారు. 12వ స్నాతకోత్సవం కన్నా 13వ స్నాతకోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించామని, అందరి ఉద్యోగుల సహకారమే ఇందుకు కారణమని, అందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని అన్నారు. పూర్వ విద్యార్థులు ఉన్నతస్థానాల్లో ఉన్నారని, ఏ సాయం కావాలన్నా వారు అందిస్తున్నారని అన్నారు. అనంతరం నూతన పరిపాలనా భవన నిర్మాణా పనులను ఏవీ ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, రిజిస్ట్రార్ శశిధర్, వర్సిటీ డైరెక్టర్లతోపాటు ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గార్లదిన్నె : కేశవాపురం గ్రామంలో టీడీపీ సానుభూతిపరుడు వెంకటప్ప భార్య కళావతి (40) అనారోగ్యంతో శుక్రవారం మరణించారు. విష యం తెలుసుకున్న శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి.. రూ. 10వేలు ఆర్థిక సాయం అందచేశారు.

బుక్కరాయసముద్రం: మండలంలోని సిద్దరాంపురం గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారుడు బండారు వెంకటకొండయ్య అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం అతన్ని పరామర్శించిన మాజీ జెడ్పీటీసీ రామలింగారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తెలుగు యువత నాయకులు చెన్నమయ్య, కాటమయ్య ఉన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

అనంతపురం క్రైం: నగరంలో వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి ఆరుగురు మట్కా బీటర్లను అరెస్ట్ చేసినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు. వారి నుంచి రూ.11,500 స్వాధీనం చేసుకున్నామన్నారు.

అలరించిన సంగీత విభావరి

అనంతపురం కల్చరల్, జనవరి 12: పాతపాటల ప్రేమికుల సంఘం సహకారంతో అనంత సినీ సంగీత కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం హౌసింగ్‌బోర్డులోని ఘంటసాల స్మారక మండపంలో నిర్వహించిన 'స్వరరాగ తరంగిణి - అపూర్వ సంగీత విభావరి' వీక్షకులను అలరించింది. కమిటీ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశులు, సంపత్‌కుమార్ సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్కేయూ విశ్రాంత ప్రొఫెసర్ సుధాకర్‌బాబు, జీవీ రామయ్య, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, గురుప్రసాద్, సుధాకర్, వెంకటేష్, న్యాయవాది పద్మజ, మల్లికార్జునమూర్తి, రవికాంత్ రమణ, గాయకులు సుధాకర్, వెంకటేష్, జ్యోతి, కేశవ, మల్లికార్జునరావు, శ్రీదేవి పాల్గొన్నారు.


కళ్యాణదుర్గంలో కోటి సంతకాలు సేకరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


గుత్తిలో సూర్యనమస్కారాలతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు


కూడేరులో ప్రార్థన చేసి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


పుట్లూరు: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు


యాడికిలో అంగన్‌వాడీల నిరసన

వినూత్నంగా నిరసన

అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన తెలుపుతున్నారు. కూడేరులో శుక్రవారం జీసస్‌ను ప్రార్థిస్తూ, గుత్తిలో సూర్యనమస్కారాలు తెలియజేస్తూ నిరసన తెలిపారు. పామిడి, గుంతకల్లులో తమకు ఇచ్చిన షోకాజ్ నోటీసుల ను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. నోటీసులకు భయపడే ప్రసక్తేలేదన్నారు. డిమాండ్ల సాధన కోసం మరింతగా ఉద్యమిస్తామని తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


గుంతకల్లులో భోగి మంటల్లో షోకాజ్ నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


యల్లనూరు: సీఎం జగన్ ఫొటో ముందు నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


విడపనకల్లులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు


ఉరవకొండలో దీక్షల్లో కూర్చున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


పామిడిలో నోటీసులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


బెళుగుప్పలో తపాలా సిబ్బందికి చేతులెత్తి నమస్కరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సెల్ టవర్ వద్దని ఆందోళన

ఉరవకొండ, జనవరి 12: పట్టణంలోని 1వ వార్డులో పాఠశాల, జనావాసాల మధ్య సెల్ టవర్ ఏర్పాటు చేయరాదని స్థానిక కాలనీవాసులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. టవర్ నిర్మాణ పనులపై అభ్యంతరం తెలిపారు. టవర్ నిర్మాణం చేపడితే రేడియేషన్‌తో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం బారిన పడతారన్నారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి అనుమతులు పొందకుండా ఎలా నిర్మాణం చేపడతారని ప్రశ్నించారు.

ఏడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రిటౌన్, జనవరి12: పట్టణంలోని యల్లనూరురోడ్డు, నంద్యాలరోడ్డు, శ్రీనివాసపురం ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఏడు ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేశామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. స్థానిక పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడిచేసి డ్రైవర్లను అరెస్టుచేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యల్లనూరు: మండలంలోని చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గురువారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శింగవరం గ్రామ సమీపం నుంచి ఇసుకను తరలిస్తుండగా దాడిచేసి అదుపులోకి తీసుకొని ట్రాక్టర్లను సీజ్‌చేశామని ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు.

క్రీడాకారులకు బెల్ట్‌ల పంపిణీ

తాడిపత్రిటౌన్, జనవరి12: పట్టణంలోని అయాన్ తైక్వాండో అకాడమీలో శుక్రవారం కలర్ బెల్ట్ ప్రమోషన్‌లో పాల్గొన్న 40మందిలో ఉత్తీర్ణత సాధించిన వారికి బెల్ట్‌లు అందించామని మాస్టర్ సాయి తెలిపారు. విశ్రాంత పీడీ శివయ్యతోపాటు పలువురు ఉత్తీర్ణత సాధించిన వారికి బెల్ట్‌లను అందించారు.

సినిమా థియేటర్ల తనిఖీ


సౌభాగ్య థియేటర్‌ను తనిఖీ చేస్తున్న ఆర్డీవో సుష్మితారాణి

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 12: పట్టణంలోని సినిమా థియేటర్లలో టికెట్లను అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు వెళ్లడంతో ఆర్డీవో సుష్మితారాణి స్పందించారు. పట్టణంలోని సినిమా థియేటర్లను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమించి థియేటర్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీని గెలిపించాలి: మాజీ ఎంపీ జేసీ


వెంగన్నపల్లిలో నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి

యాడికి, జనవరి12: రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వెంగన్నపల్లి, పుప్పాల గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్య టించారు. ఆయా గ్రామాల్లోని నాయకులను కలిసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులు బాగాలేవ న్నారు. అభివృద్ధి కానరావడం లేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పాలన కావాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు నాగమునిరెడ్డి, త్రినాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, వెంకటనారాయణరెడ్డి, దేవేంద్ర, రామునాయక్, జయరాంనాయక్, సత్యనారాయణరెడ్డి, చలమారెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు


కంబదూరులో అంగన్‌వాడీ కేంద్రానికి నోటీసులు అతికిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కళ్యాణదుర్గం, జనవరి 12 : ఉద్యోగాల నుంచి ఎందుకు తొలగించకూడదో చెప్పాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు అధికారులు షోకాజ్ నోటీసులను ఇస్తున్నారు. కంబదూరు ప్రాజెక్టు పరిధిలో ఉన్న కంబదూరు, కుందుర్పి, శెట్టూరు మండలాల పరిధిలో ఉన్న 373 అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ షోకాజ్ నోటీసులను అతికించారు. దాంతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తల, ఆయాల ఇళ్లకు కూడా ఈ నోటీసులను అతికించారు. రిజిస్టర్ పోస్టు ద్వారా కూడా వీటిని పంపారు. మూడు రోజుల నుంచి సూపర్‌వైజర్లు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది ఇలా బృందాలుగా ఏర్పడి షోకాజ్ నోటీసులు అందించే ప్రక్రియలోనే నిమగ్నం అయిపోయారు. శుక్రవారానికి ప్రతి ఒక్కరికి చేరే విధంగా చేసి, పూర్తి చేశారు.

టీడీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు


జీ కొట్టాల గ్రామంలో మహిళలకు సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న వెంకటశివుడుయాదవ్

పామిడి, జనవరి 12: తెలుగుదేశంపార్టీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని జీ కొట్టాల, కాళాపురం గ్రామాల్లో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. జీ కొట్టాల గ్రామం శివారు నుంచి టీడీపీ నాయకులు పసుపు జెండాలతో బైక్ ర్యాలీ చేపట్టారు. గ్రామంలో ప్రజలు గజమాలతో స్వాగతించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గుంతకల్లు మార్కెట్ యార్డు బండారు ఆనంద్, రామాంజనేయులుయాదవ్, కదిరప్ప, అనుంపల్లి సుంకప్ప, పెద్దిరెడ్డియాదవ్, ఓబుళయ్యయాదవ్, వీరారెడ్డి, భాస్కర్, రంగారెడ్డి, హరీష్, శివ, రాము, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యం, పట్టుబడ్డ వ్యక్తితో జిల్లా సెబ్ అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, సిబ్బంది

కళ్యాణదుర్గం, జనవరి 12: కర్ణాటక నుంచి అక్రమంగా ఆంధ్రకు తరలిస్తునన మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ జిల్లా అడిషనల్ ఎస్పీ రామకృష్ణ శుక్రవారం కంబదూరు సెబ్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. కుందుర్పి మండలం మీదుగా ఆంధ్రకు కర్ణాటక మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నా రు. ఈ దాడుల్లో రూ. 3 లక్షలు విలువ చేసే కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనంతో పాటు, 72 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. డ్రైవర్‌లోను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు.

ఉరవకొండ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని పట్టణంలో అరెస్టు చేసి, వారి నుంచి 200పైగా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్‌ఐ పాల్ శుక్రవారం తెలిపారు.

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరు గ్రామంలో శుక్రవారం చిన్నగంపయ్య నుంచి 16 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

యల్లనూరు: మండలంలోని బుక్కాపురం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వెంకటరామయ్య నుంచి 23మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ ధరణీబాబు తెలిపారు.

పుట్లూరు: మండలంలోని చాలవేముల గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఒంటెద్దు శివశంకర్‌రెడ్డిని అరెస్ట్ చేసి, అతడి నుంచి 30మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి: జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

ఉరవకొండ, జనవరి 12: రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మండంలోని బూదగవి, ఉరవకొండలోని పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ స్టేషన్‌లలో సదుపాయాల వివరాల గురించి ఆరా తీశారు. ర్యూట్ మ్యాప్‌ను పరిశీలించారు. విడపనకల్లు, ఉరవకొండ మండలంలోని 45 పోలింగ్ కేంద్రాల పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో వైఖోమ్ నిదియాదేవి, తహసీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో అమృత్‌రాజ్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండలంలోని వివిధ గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను జేసీ కేతన్‌గార్గ్ శుక్రవారం పరిశీలించారు. ఉండబండ, చీకలగురికి, గాజుల మల్లాపురం, పాల్తూరు, గ్రామాల్లో పర్యటించారు. పోలింగ్ బూత్‌ల పరిధిలోని ఓటర్లను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండల అధికారులు ఉన్నారు.

అభివృద్ధి కావాలంటే టీడీపీకి పట్టం కట్టండి

తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, జనవరి12: మండలంలో అభివృద్ధి కావాలంటే టీడీపీకి పట్టం కట్టాలని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం కార్యకర్తలు, ప్రజలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి అంటే గత టీడీపీ హయాంలో నిర్మించిన పంచాయతీ కాంప్లెక్స్ భవనాలు, జేసీ దివాకర్‌రెడ్డి ఫంక్షన్‌హాలు, తాగునీటి సౌకర్యం, రహదారి విస్తరణ, భూగర్భజలాల పెంపునకు చెక్‌డ్యాంల నిర్మాణం వంటివి నిదర్శనమన్నారు. గతంలో పంచాయతీ అభివృద్ధికోసం నిధులను సమీకరిస్తే కొందరు వైసీపీ నాయకులు అభివృద్ధి మాటున అక్రమంగా కాజేశారని ఆరోపించారన్నారు. పల్లెలు అభివృద్ధి బాటలో పరుగులు పెట్టాలంటే చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. టీడీపీకి ఓటువేసి వైసీపీకి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరపడ్డాయని ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, పుట్లూరు లక్ష్మీకాంతరెడ్డి, గంగరాజుయాదవ్, నారాయణస్వామి, రామచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, దస్తగిరి, నాగరాజు, ప్రసాద్‌యాదవ్, రమేష్‌యాదవ్ చిరంజీవులు, లక్ష్మీనారాయణ, బాషా, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వివేకానందుడి జీవితం..స్ఫూర్తిదాయకం



ఉరవకొండ డిగ్రీ కళాశాలలో వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సిబ్బంది

యాడికి, జనవరి12: స్వామి వివేకానందుడి జీవితం నేటియువతకు స్ఫూర్తిదాయకమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవికుమార్‌రెడ్డి తెలిపారు. వివేకానందుడి జయంతి, యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం రాయలచెరువులోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు రవిప్రసాద్, సూర్యనారాయణ, రామకృష్ణ, ఇస్మాయిల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని ప్రిన్సిపాల్ రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో ఆయూర్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, వేషధారణ పోటీలు నిర్వహించారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని చర్చి స్కూలులో శుక్రవారం స్వామి వివేకానందుడి జయంతి వేడుకలను ఏబీవీపీ నాయకులు ఘనంగా నిర్వ హించారు. వివేకానందుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

కుందుర్పి: మండలంలోని తూముకుంట, మలయనూరు విలువలబడులలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివేకానందుడి గురించి విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేశారు.

బెళుగుప్ప: స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. మల్లికార్జున, తిమ్మప్ప, అశోక, లక్ష్మన్న, గడ్డం వన్నూరుస్వామి, ఎం వన్నూరుస్వామి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా పెంచాలి: డీఎస్పీ

బొమ్మనహాళ్, జనవరి 12: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, సరిహద్దు ప్రాంతాల్లో నిఘా మరింత పెంచాలని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం ఆంధ్రా సరిహద్దులోని బొమ్మనహాళ్, బొల్లనగుడ్డం చెక్‌పోస్టులను ఆయన పరిశీలించారు. డీఎస్పీ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రం నుండి అక్రమ మద్యం, నగదు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని సూచించారు. కర్ణాటక రాష్ట్రం నుండి ఆంధ్రాలోకి వచ్చే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కుందుర్పి, జనవరి 12: మండలంలోని యర్రగుంట గ్రామానికి చెందిన ఓంకేష్(40) శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు ఓంకేష్ ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసి విక్రయిస్తుండేవాడు. అందులో భాగంగా కర్ణాటక ప్రాంతానికి ద్విచక్రవాహనాల కొనుగోలుకు వెళ్లి వస్తుండగా దావణగెర రాణిబెన్నూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. గాయపడిన అతడిని స్థానికులు, పోలీసులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు భార్యలు, పిల్లలు ఉన్నారు.

కొనసాగుతున్న ధర్నా

విడపనకల్లు, జనవరి 12: మండలంలోని కరకముక్కల గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతురాలు ఎర్రెమ్మ మూడో రోజు శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎర్రెమ్మ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ రెండు రోజులు ధర్నా చేయటంతో రెవెన్యూ అధికారులు కరకముక్కల గ్రామానికి వచ్చి సర్వేలు నిర్వహించి స్థలాన్ని అప్పగిస్తామని తెలిపారన్నారు. గురువారం కరకముక్కల గ్రామానికి వెళ్లి కొలతలు నిర్వహించి ఈమె ప్లాట్‌కు లేఅవుట్ లేదని వైసీపీ నాయకులు మాటలు విని వెనుతిరిగి వెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో మళ్లీ నిరసన తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఎర్రెమ్మకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థలాన్ని అప్పగించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

కల్లగళ్ల ఆరో వార్డు మెంబర్ రాజీనామా

కూడేరు, జనవరి 12: మండలం కల్లగళ్ల గ్రామ పంచాయతీ ఆరో వార్డు మెంబర్ ముంగ కవిత తన పదవికి రాజీనామా చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగభూషణరెడ్డికి శుక్రవారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈమె వైసీపీ మద్దతుతో గెలిచిన విషయం తెలిసిందే.

జీడిపల్లిలో 0.607 టీఎంసీల నీటి నిల్వ

బెళుగుప్ప, జనవరి 12 : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం నీటి నిల్వ 0.607 టీఎంసీలు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 404 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో కింద 600 క్యూసెక్కులు ఉన్నట్లు వెల్లడించారు.

వైసీపీ మునిగిపోయే నావ: మాజీ ఎమ్మెల్సీ


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దీపక్‌రెడ్డి

రాయదుర్గం, జనవరి 12: వైసీపీ మునిగిపోయే నావ అని మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు గ్రామం వద్ద జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజు తోటలో శూన్యం మారెమ్మ పూజల్లో పాల్గొన్నారు. అంతకు ముందు రాయదుర్గంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. రాయదుర్గానికి రావడం వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశ్యాలు లేవన్నారు. తెలుగుదేశం పార్టీ గెలుపు కోసమే తాము పనిచేస్తామన్నారు. లోకేష్ నిర్వహించిన యువగళం పాదయాత్రలో ఐదువేలకు పైగా సమస్యలను ప్రజలు తెలిపితే వాటిలో ఒక్కటి కూడా ప్రభుత్వం పరిష్కారం చేయలేదన్నారు. ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను మార్పులు చేసుకున్నా గెలుపు ఉండదన్నారు. తెలుగుదేశం ముందు ఉన్న ఏకైక లక్ష్యం చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవడమేనన్నారు. అధిష్టానం నిర్ణయమే శిరోధార్యంగా భావిస్తామన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న దీపక్‌రెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామిని మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. స్థానిక టీడీపీ నాయకులు పురోహితులతో ఘనస్వాగతం పలికించారు. అనంతరం మాజీ సర్పంచ్ టీడీపీ నాయకుడు బెళ్లి హనుమంతరెడ్డి స్వగృహంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జగన్నాథరెడ్డి, రాజశేఖర్, టీడీపీ పయ్యావుల మోహన్‌బాబు, కొత్తపల్లి బాబు, బుడుగు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సుదర్శన్, ఉంతకల్లు ప్రేమ్‌నాథ్, గాదిలింగ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే బీసీలకు పెద్దపీట

గుంతకల్లుటౌన్,జనవరి12: టీడీపీ హయాంలోనే చంద్రబాబు బీసీలకు పెద్దపీట వేశారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడ్ శుక్రవారం పేర్కొన్నారు. మండలంలోని కసాపురం గ్రామంలోని వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రచార రథాలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. గత టీడీపీ హయంలో బీసీలకు చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో కేశప్ప, పాలమల్లికార్జున, గుమ్మనూరు వెంకటేష్, తలారి మస్తానప్ప, కృష్ణారెడ్డి, కురుబ శివన్న, హనమంతు తదితరులు పాల్గొన్నారు.

పేదలపై పగపట్టిన వైసీపీ: పీజేఆర్



పామిడి, జనవరి 12: రాష్ట్రంలో పేదలు పండుగ చేసుకోకుండా వైసీపీ ప్రభుత్వం పగ పట్టిందని టీడీపీ నాయకులు, పీజేఆర్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ పాలనలో సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకల ద్వారా రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబం సంతోషంగా పండుగలను జరుపుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో పేదవాడి కుటుంబం పండుగలకు దూరమైందని మండిపడ్డారు. వైసీపీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీంతో కుటుంబ పోషణ సైతం తలకు మించిన భారంగా మారిందని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రతి పేదవాడు పండుగ జరుపుకోవాలన్న, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కాలన్నా వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

కళ్యాణదుర్గం, జనవరి 12: కంబదూరులోని మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ప్రాంగణంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు శుక్రవారం జరిగాయి. మల్లేశ్వరస్వామి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. నిర్వాహకులు మహేష్, జగ్గు, తిప్పేస్వామి తదితర మిత్ర బృందానికి పలువురు మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ అండతో కురుబలను అణగదొక్కిన కాపు

కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే


విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌కే మల్లికార్జున

బొమ్మనహాళ్, జనవరి 12: వైసీపీ ప్రభుత్వం అండతో రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి నియోజకవర్గంలో ఉన్న కురుబ కులస్థులకు అన్ని రకాలుగా అణగదొక్కి ద్రోహం చేశాడని టీడీపీ సీనియర్ నాయకుడు కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌కే మల్లికార్జున విమర్శించారు. మండలంలోని ఉంతకల్లు, ఉద్దేహాళ్, దేవగిరిక్రాస్ తదితర గ్రామాలలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఉద్దేహాళ్ గ్రామంలోని మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ నాగరాజు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాపు రామచంద్రారెడ్డి ఈ ఐదేళ్ల కాలంలో కురుబలకు ఎలాంటి సంక్షేమ పథకాలు కానీ, అభివృద్ధి పనులు చేయకుండా అణగదొక్కి ద్రోహిగా మిగిలాడని విమర్శించారు. ఉంతకల్లు గ్రామానికి చెందిన మల్లన్న ఎమ్మార్సీలో చిరుద్యోగిగా పనిచేస్తుంటే తప్పుడు కేసు పెట్టించి ఉద్యోగం నుండి సస్పెండ్ చేయించాడని తెలిపారు. బొమ్మనహాళ్‌కు చెందిన కురుబ తిప్పమ్మ భూమిని వేరే వాళ్లు కబ్జా చేసేందుకు కాపు రామచంద్రారెడ్డి సహకరించాడన్నారు. ఉద్దేహాళ్ గ్రామంలోను కురుబ కులస్థులకు చెందిన భవనా లను తొలగించారని విమర్శించారు. పులకుర్తి గ్రామంలో కూడా సర్పంచ్ దొణప్పపై అవహేళన చేసి అసభ్యకరంగా ప్రవర్తించాడని, తనపై కూడా అక్రమ కేసులు బనాయించి బెయిల్ రాకుండా కుట్రపన్నాడని ఎస్‌కే మల్లికార్జున విమర్శించారు. కణేకల్లు మండలంలో జక్కవడికి గ్రామంలో కూడా కురుబ వసంతమ్మపై దౌర్జన్యం చేయించాడని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో కాలవ శ్రీనివాసులు సహకారంతో కురుబ కులస్థులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందారని రాయదుర్గం, గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, కణేకల్లు మండలాలలో కమ్యూనిటీ కల్యాణమంటపాల భవనాలకు స్థలాలు ఇప్పించి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో కే నాగరాజు, మాజీ సర్పంచ్ హనుమంతరెడ్డి, దిలీప్‌కుమార్, శివకుమార్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.